


కలెక్టర్‌ను కలిసిన ఆర్టీసీ డీఎం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి ఆర్‌టీసీ డీఎంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కరుణశ్రీ గురువారం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో పరిగి ఆర్టీసీ డీఎంగా పని చేసి బదిలీపై కామారెడ్డి ఆర్టీసీ డీఎంగా బాధ్యతలు చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణించే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



కామారెడ్డి బల్దియాలో నిర్మాణాలు ఇష్టారాజ్యంగా!



- పట్టణాల్లో అడ్డగోలుగా కొనసాగుతున్న భవన నిర్మాణాలు
- నిబంధనలు పాటించకుండా అపార్ట్‌మెంట్‌లు, వాణిజ్య సముదాయల నిర్మాణాలు
- కనీసం వాహనాల పార్కింగ్‌కు స్థలాలు వదలని పరిస్థితి
- మున్సిపల్ చట్టాన్ని సైతం లెక్కచేయని వైనం
- అక్రమ నిర్మాణాలకు నేతల అండదండలు
- ఒత్తిళ్లతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న బల్దియా అధికారులు

కామారెడ్డి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలోని ఓ చౌరస్తాలో భవననిర్మాణానికి మున్సిపల్ నుంచి అనుమతి తీసుకున్నప్పటికీ ఆ స్థలంలో నిబంధనలను పాటించకుండా నిర్మాణ పనులు చేపడుతున్నారు. కనీసం పార్కింగ్ స్థలం కూడా లేకుండా వాణిజ్య సముదాయ భవనాన్ని నిర్మిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ఓ కాలనీలో కొందరు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి వాణిజ్య సముదాయ నిర్మాణం పనులు చేపడుతున్నారు. ఇలా జిల్లాలోని కామారెడ్డి, బాన్స్‌వాడ, ఎల్లారెడ్డి పట్టణాలలో ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఆయా పట్టణాల్లో కొత్త కాలనీలు వెలుస్తుండడం, మున్సిపాలిటీ అంతకు అంతగా విస్తరిస్తుండడంతో భవన నిర్మాణాల సంఖ్య సైతం పెరుగుతోంది. అపార్ట్‌మెంట్‌ల కల్చర్ సైతం చాలానే వచ్చింది. అక్రమనిర్మాణాలు, ప్రభుత్వ స్థలాలను కబ్జాచేసి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకునేందుకు గతంలో కొత్త మున్సిపల్ చట్టాన్ని అమలు చేసింది. కానీ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలో ఈచట్టం అమలుకావడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇటు ప్రజాప్రతినిధులు దృష్టిసారించకపోవడం అటు అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణాల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణలు కొనసాగుతున్నాయి. మూడు మున్సిపాలిటీలలో భవన నిర్మాణాల కోసం దరఖాస్తుచేసుకున్న పలుచోట్ల దరఖాస్తులను బల్దియా అధికారులు తిరస్కరించినప్పటికీ ఆ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. స్థానిక నేతల అండదండలతో అనుమతులు లేకున్నా నిర్మాణాలు చేపడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. దీంతో ఆయా మున్సిపాలిటీలకు రావాల్సిన ఆదాయం సమకురడం లేదు.

అనుమతి ఒకటా.. నిర్మాణాలు మరోలా..

జిల్లా కేంద్రంతో పాటు బాన్స్‌వాడ, ఎల్లారెడ్డి పట్టణాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో జీప్లస్ 2, జీప్లస్ 3, జీప్లస్ 4 అనుమతి తీసుకుని నిర్మించుకుంటున్న ఇండ్ల మీద నీళ్లట్యాంకుల నిర్మాణం పేరుతో అదనపు స్లాబ్‌లు వేస్తున్నారు. వాస్తవానికి ట్యాంక్ నిర్మిస్తే దానిక్రింద ఇంటి నిర్మాణం ఉండకూడదు. ఉంటే అదనపు గదిగా పరిగణిస్తారు. దింతో దాని అక్రమ కట్టడం క్రింద లెక్క కడతారు. కొందరు నివాస గృహ నిర్మాణానికి అనుమతి తీసుకుంటుండగా నిర్మాణం పూర్తయ్యాక షెటర్లు వేసి వాణిజ్య సముదాయాలుగా మార్చేస్తున్నారు. ఇలా అనుమతి ఒకలా తీసుకుంటూ నిర్మాణాలు మరోలా చేపడుతున్నారు. ఇక చాలమంది ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. అపార్ట్‌మెంట్, వాణిజ్య, వ్యాపార సముదాయాల నిర్మాణాలు చాలామట్టుకు నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినప్పటికి చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలతో మున్సిపాలిటికి రావాల్సిన ఆదాయానికి గండిపడుతుంది.

కాగితాలకే పరిమితమవుతున్న నిబంధనలు

రాష్ట్రప్రభుత్వం భవననిర్మాణాల అనుమతుల కోసం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటికే ఈ విధానం అమలవుతూనే ఉంది. ఆయా పట్టణాల్లో ఎవరైనా నిర్మాణాలు చేపట్టాలంటే అనుమతి కోసం మీసేవలోని టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే జిల్లాలోని మూడు మున్సిపాలిటీల నుంచి భవన నిర్మాణాల కోసం భారీగా దరఖాస్తులు వస్తున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ చట్టం నిబంధనల ప్రకారం 120 గజాల స్థలం ఉన్నవారు ఇళ్లు కట్టుకోవాలంటే 1.5 మీటర్ల సెట్‌బ్యాక్ వదలి పెట్టాలి. రోడ్డు 30 అడుగులు ఉంటే ఇరువైపులా 5 అడుగుల చొప్పున స్థలాన్ని మున్సిపాలిటికీ అటాచ్‌చేయాలి. ప్రధాన రహదారి అయితే ఈ సెట్ బ్యాక్ మూడు మీటర్లు ఉండాలి. ఈ నిబంధనలు అన్ని కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాహనాల పార్కింగ్ కోసం సెల్లార్‌లు ఏర్పాటు చేస్తూ అందులో వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేస్తున్నారు. మరికొన్నిచోట్ల నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ నిర్మాణాలు చేస్తున్నారు. మరి కొన్ని చోట్ల రోడ్ల అంచువరకు నిర్మాణాలు చేపడుతున్నారు. అంతేకాకుండా బల్దియాలో పార్కింగ్ స్థలాలు కనిపించడం లేదు. హోటల్‌లు, ఆసుపత్రులు, వ్యాపార సముదాయాలు, పాఠశాలలు, కళాశాలల నిర్మాణాలు అయితే నూతన చట్టం ప్రకారం 25 శాతం స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు ఎక్కడ కూడా అమలు కావడం లేదు.

అక్రమ నిర్మాణాలకు నేతల అండదండలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్స్‌వాడ పట్టణాలలో సాధారణ కొత్త ఇళ్ల నిర్మాణంతోపాటు భారీ అంతస్తుల భవననిర్మాణాలు కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీల నుంచి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడానికి వీలులేదు. కాని కొందరు ఇళ్ల యజమానులు, బిల్డర్లు, వ్యాపారవేత్తలు మున్సిపాలిటి నుంచి అనుమతి తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. ఆయా వార్డులలో అక్రమ నిర్మాణాలు జరగడానికి నేతల అండదండలు ఉంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపల్ నుంచి అనుమతులు తీసుకోకపోవడమే కాకుండా కనీసం నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. మున్సిపాలిటీలకు చెందిన డ్రైనేజీ, రోడ్లను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. కాని స్థానిక నేతల ఒత్తిళ్లతో అధికారులు వెనుకడుగు వేస్తుండడంతో అటువైపు కన్నెతి చూడడం లేదు.

రాజీవ్ యువ వికాసంపై
విస్తృత ప్రచారం కల్పించాలి

- రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్
- భిక్కనూరులో పథకంపై అధికారులతో సమీక్షా సమావేశం



అధికారులతో సమీక్షా నిర్వహిస్తున్న దృశ్యం

భిక్కనూరు,ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న రాజీవ్ యువవికాసంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ ఆదేశించారు. గురువారం భిక్కనూరు మండలంలో పర్యటించిన ఆయనరాజీవ్ యువవికాసం పథకంలో భాగంగా దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయంలో ఈ కార్యక్రమంపై ఎంపీడీవో, తహసీల్దార్, గ్రామ పంచాయతీ అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువవికాసానికి ఎక్కువ మొత్తంలో నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకునేలా అధికారులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, గ్రామాల్లో, ప్రధానకూడళ్ల వద్ద పూర్తి వివరాలతో ప్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. కులం, ఆదాయ సర్టిఫికెట్లపై దరఖాస్తు చేసుకున్న వారికి త్వరతగతిన మంజూరు చేయాలని సూచించారు. అంతకుముందుగా మండలానికి తొలిసారిగా వచ్చిన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, మండల అధికారులు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తుడుం జీవన్, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే
ప్రమాదాలను నివారించవచ్చు: కలెక్టర్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమ, నిబంధనలు పాటిస్తే రోడ్డుప్రమాదాలను నివారించవచ్చని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో గత మూడునెలలో జరిగిన రోడ్డుప్రమాదాల వివరాలను అడిగి తెలుసుకుని కారణాలను విశ్లేషించారు. కనీస రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. జాతీయ రహదారిపై పరిమితికి లోబడి వాహనం వేగం ఉండాలని, పరిమితికి మించి వాహనాన్ని నడిపితే స్పీడ్ గన్ ద్వారా గుర్తించి వారిపై జరిమానా వేస్తామని తెలిపారు. ఎస్పీ రాజేష్‌చంద్ర మాట్లాడుతూ జిల్లాలో 28 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించామని, తెల్లవారుజామున నిద్రలో, రాత్రి 8గంటల తర్వాత, అతివేగంగా, నిర్లక్ష్య పూరిత డ్రైవింగ్ వల్లే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. అనుమతించబడిన వేగం వరకే వాహనాలు నడపాలని అతివేగంగా, రాంగ్‌రూట్‌లో వాహనాన్ని నడిపి ప్రమాదాన్ని కొనితెచ్చుకోవద్దని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, ఆర్‌టీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంత్‌రావు పాల్గొన్నారు.

దొడ్డికొమురయ్యకు ఘన నివాళి

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన యోధుడు దొడ్డికొమురయ్య అని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కొమురయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ కోసం పోరాడి అమరుడైన తొలి వ్యక్తిగా ఆయన చరిత్రలో నిలిచారన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ చందర్ నాయక్, బీసీ అభివృద్ధి అధికారి స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

కొత్తగా 26 సహకార సొసైటీలకు
ప్రతిపాదనలు పంపాం

- ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది
- అక్రమాలకు పాల్పడిన సొసైటీలకు నోటీసులిచ్చాం
- యాసంగిలో సొసైటీల ఆధ్వర్యంలో 236 కొనుగోలు కేంద్రాలు
- రెండు సీజన్లకు సంబంధించి ధాన్యం కొనుగోలు కమీషన్ డబ్బులు రావాల్సి ఉంది
- ఏడు సొసైటీల్లో ఇన్‌చార్జి కార్యదర్శులు ఉన్నారు
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వ్యవసాయ సహకార సంఘం జిల్లా ఇన్‌చార్జి అధికారి రామ్మోహన్



కామారెడ్డి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో 26 కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారుచేసి ఇదివరకే ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతం సొసైటీల పాలక వర్గాల గడువు ముగిసింది. ఆ పాలక వర్గాలనే కొనసాగిస్తూ ప్రభుత్వం నెల రోజుల కిందట ఆదేశాలు జారీచేసింది. ఈ యాసంగి సీజన్‌లో సహకార సంఘాల ఆధ్వర్యంలో 263 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశాం. ఈ కేంద్రాలలో సొసైటీల నుంచి పలు సిబ్బందిని కేటాయించినట్లు వ్యవసాయ సహకార సంఘం జిల్లా ఇన్‌చార్జి అధికారి రామ్మోహన్ అన్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో డీసీవో పలు వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో మొత్తం ఎన్ని సహకార సంఘాలు ఉన్నాయి?

డీసీఓ: కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం 55 సహకార సంఘాలున్నాయి. నెల కిందటే ఈ సొసైటీల పాలకవర్గాల గడువు ముగిసింది. ఆ పాలకవర్గాలనే కొనసాగించాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో వారి పాలనలోనే కొనసాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: కొత్తగా ఎన్ని సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలిచ్చారు?

డీసీఓ: జిల్లాలో మరో 26 కొత్త సహకార సంఘాల ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. కామారెడ్డిలో చిన్నమల్లారెడ్డి, గర్గుల్, పల్వంచ, అన్నారం, సోమారంపేట, ఎల్లారెడ్డిలో లక్ష్మాపూర్, రామారెడ్డి, ఉప్పల్‌వాయి, భవానిపేట, కొమటిపల్లి, ఆత్మకూర్, జప్తిజన్కంపల్లి, నాగిరెడ్డిపేట, కొండాపూర్, గండివేట్, మత్‌సంగెం, బ్రహ్మణపల్లి, యాచారం, జుక్కల్‌లో ఖండేబల్లూర్, పెద్దఎక్లారా, శాంతాపూర్, వడ్లం, పిట్లం, బాన్సువాడలో హన్మాజీపేట, సంగెం, తిమ్మాపూర్‌లను ప్రతిపాదించాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో అక్రమాలకు పాల్పడిన సొసైటీలు ఏమైనా ఉన్నాయా?

డీసీఓ: జంగంపల్లి, బైరాపూర్, మాచారెడ్డి సొసైటీలలో ఆడిట్ సందర్భంగా పలు అక్రమాలు జరిగాయని తెలింది. సొసైటీలోని ఎరువులను పక్కదారి పట్టించారని, ఖర్చులు ఎక్కువగా చూపారని తెలడంతో ఆ సొసైటీలకు నోటీసులు జారీచేశాం.

ఆంధ్రజ్యోతి: అన్ని సహకారసంఘాలకు పూర్తిస్థాయిలో కార్యదర్శులు ఉన్నారా?

డీసీఓ: 55 సహకార సంఘాలు ఉండగా, 48 సొసైటీలకు పూర్తిస్థాయిలో సెక్రటరీలు ఉన్నారు. మరో ఏడు సొసైటీలకు ఇన్‌చార్జ్ కార్యదర్శులు కొనసాగుతున్నారు. ఈ సొసైటీలలో ఉన్న పూర్తిస్థాయి కార్యదర్శులు ఇటీవల పదవీ విరమణ పొందడంతో ఖాళీ అయ్యాయి.

ఆంధ్రజ్యోతి: సహకార సంఘాల ఆధ్వర్యంలో ఎన్ని వరిధాన్యం కొనుగోళ్ల ఏర్పాటు చేస్తున్నారు?

డీసీఓ: యాసంగి సీజన్‌లో సహకార సంఘాల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. మొత్తం 263 సొసైటీల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో 228 దొడ్డురకం ధాన్యం, 35 సన్నరకం ధాన్యం కేంద్రాలను ఏర్పాటుచేయనున్నాం.

ఆంధ్రజ్యోతి: ధాన్యం కొనుగోళ్లతో సొసైటీలకు రావాల్సిన కమీషన్ ఏమైనా పెండింగ్‌లో ఉన్నాయా?

డీసీఓ: వానకాలం, యాసంగి సీజన్‌లలో సహకార సంఘాల ఆధ్వర్యంలో 328 నుంచి 397 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తుంటాం.అయితే 3.05 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 4లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం. పౌర సరాఫరాల మార్కెటింగ్ శాఖ నుంచి క్వింటాకు రూ.32 కమీషన్ సహకార శాఖకు ఇస్తుంటారు. ఈ కమీషన్ డబ్బులు రెండు సీజన్‌లకు సంబంధించినవి పెండింగ్‌లో ఉన్నాయి. 2023-24 రబీ, 2024-25 ఖరీఫ్‌కు సంబంధించి కమీషన్ డబ్బులు రావాల్సి ఉంది. ఒక్కో సీజన్‌కు కమీషన్ రూపంలో జిల్లా సహకార శాఖకు సుమారు రూ.14 కోట్ల వరకు ఆదాయం సమకురనుంది.



బాన్సువాడలో నేలకొరిగిన వరి పంట

అకాల నష్టం!

- ఈదురుగాలులకు నేలకొరిగిన వరి పంట
- మరికొన్నిచోట్ల వర్షానికి తడిసిన ధాన్యం

కామారెడ్డి, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పుడిప్పుడే పంటలు చేతికొస్తున్న సమయంలో అకాల వర్షాలు రైతులను నష్టాల పాల్జేస్తున్నాయి. కొన్నిచోట్ల వరికోతలు మొదలయ్యాయి. మరికొన్నిచోట్ల జొన్న, మొక్కజొన్న, శనగ పంటల నూర్పిడీ ప్రారంభించి దిగుబడులను మార్కెట్‌లకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో అకాల వర్షాలు అన్నదాతలను ఆగం చేస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు తీవ్రఎండలు ఉక్కబోతలతో ఇబ్బందులు పడ్డ ప్రజలు గురువారం వాతావరణం మొత్తం చల్లబడడంతో కాస్త ఉపశమనం పొందారు. కాని అకాలవర్షాలు రైతులను ఇబ్బందులు పెడుతున్నాయి. జిల్లాలో కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి డివిజన్‌ల పరిధిలో పలుచోట్ల ఓ మోస్తారు వర్షాలు కురిశాయి. మరికొన్నిచోట్ల వడగండ్ల వర్షాలు కురువగా ఈదురుగాలులు వీయడంతో వరి, మొక్కజొన్న, జొన్న పంటలకు నష్టం వాటిల్లింది. బాన్సువాడ, బీర్కూర్, బిచ్కుంద, పిట్లం, సదాశివనగర్, కామారెడ్డి, రామారెడ్డి మండలాల్లో ఈదురు గాలులకు వరి, మొక్కజొన్న, జొన్నపంటలు నేలకు ఒరిగాయి. మరికొన్నిచోట్ల వరి కోతలు కోసి కుప్పలు పోయగా వర్షానికి తడిసిపోయాయి. గురువారం మొత్తం ఆకాశం మేఘావృతం కావడంతో కొన్ని చోట్ల రైతులు అప్రమత్తమై ధాన్యాన్ని కాపాడుకున్నారు.

వర్షానికి నేలకొరిగిన వరి పంటలు

బిచ్కుంద: అకాల వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వరి పంటలు నేలకొరిగాయి. గుండెనెమ్లి, వాజీద్‌నగర్, సీతారాంపల్లి, మాన్యపూర్ గ్రామాల్లో (తరువాయి 8వ పేజీలో..)



బిచ్కుందలో ఈదురుగాలులకు అడ్డం పడిన వరి



మిర్జాపూర్‌లో తడిసిన వరి ధాన్యం



సీతారాంపల్లిలో రాలిపోయిన ధాన్యం రాశులు



బీర్కూర్‌లోని తిమ్మాపూర్‌లో..

కెనాల్‌ను పరిశీలించిన సబ్ కలెక్టర్



శర్బత్ కెనాల్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శర్బత్ కెనాల్ డీ40/11 కెనాల్‌తో పాటు తేజు కెనాల్‌ను ఆయన పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి కెనాల్స్‌ను పరిశీలించారు. రైతులకు వచ్చే సీజన్‌లో ఇబ్బందులు కలగకుండా చివరి ఆయకట్టుకు నీరందేలా చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా కెనాల్, కెనాళ్లపై ఉన్న కల్వర్టు పరిస్థితులపై ఆరా తీశారు. శిథిలావస్థలో ఉన్న కల్వర్టులను వెంటనే మరమ్మత్తులు చేయాలన్నారు.ఆయన వెంట సంబంధిత శాఖ అధికారులు తదితరులున్నారు.

● జాతీయ కుటుంబ ప్రయోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద 18నుండి 60సంవత్సరాల మధ్య వయసు ఉన్న కుటుంబానికి ఆదాయం అందించే వ్యక్తి సహజ మరణం చెందినట్లయితే అతని కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేయబడుతుందన్నారు. అర్హులైన కుటుంబాలు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం సంబంధిత తహసీల్దార్లను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

దేగాంలో సైన్స్‌ల్యాబ్ నిర్మాణానికి శంకుస్థాపన



దేగాంలో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్,ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):ఆలూర్ మండలం దేగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వశిక్ష అభియాన్ సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి ఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి గురువారం భూమి పూజ చేశారు. కేంద్ర ప్రభుత్వం సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు రూ.13లక్షల 50 వేలు మంజూరు చేసింది. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలకు గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు యాదగిరి, కార్యదర్శి శ్రీనివాస్, సొసైటీ వైస్‌చైర్మన్ , డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆస్తిపన్నుపై పట్టణ ప్రజలకు శుభవార్త

బోధన్‌రూరల్,ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): బోధన్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం కమిషనర్ వెంకట నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన వివరాలను వివరించారు. 02-04-2025ద్వారా ఇంటి మరియు వ్యాపార సంస్థల ఆస్తి పన్నుపై 5శాతం డిస్కౌంట్ ప్రభుత్వం చేసిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తిగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి 2025-26లో ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1నుంచి ఏప్రిల్ 30వరకు 5శాతం రిబేట్ లభిస్తుందన్నారు. కావున పట్టణ ప్రజలు 2025-26ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను చెల్లించి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంబంధిత ఏరియా బిల్ కలెక్టర్‌కు డబ్బులు చెల్లించి రసీదు పొందాలన్నారు. ఏమైనా అనుమానాలు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.



నందిపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి



రావుట్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐడీసీఎంఎస్ మేనేజర్ నగేష్



ధాన్యం లోడును పరిశీలిస్తున్న తహసీల్దార్

ప్రతి గింజనూ కొనుగోలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

● డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి

నందిపేట,ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి తెలిపారు. గురువారం నందిపేట మండలంలోని ఐలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని నందిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రూ.4లక్షల పైచీలుకు ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేశారని, వాటిని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సుమారు 660 కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఐకేపీ, మార్కెటింగ్, సహకార శాఖల ఆధ్వర్యంలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని డీసీసీబీ చైర్మన్ కుంటరమేష్‌రెడ్డి పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో స్థానిక సొసైటీ చైర్మన్ మీసాల సుదర్శన్, వైస్ చైర్మన్ బైన చిన్నారెడ్డి, డైరెక్టర్ కొండాపురం నర్సయ్య, సీఈవో దాసరి నరహరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, వీడీసీసభ్యులు, నాయకులు ఉన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ ఏపీఎం మాణిక్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కష్టించి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ ప్రకాష్, జీపీ కార్యదర్శి, సీఏలు, మహిళ గ్రూప్ సభ్యులు, పాల్గొన్నారు.

మోపాల్: రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్ముకొని మోసపోకుండా ఉండేందుకే రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బాడ్సి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బాడ్సి, ముదక్‌పల్లి, మంచిప్ప గ్రామాల్లో ప్రారంభించారు ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రాజకిషన్, పాలకవర్గం సభ్యులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యం కేంద్రాల్లోనే విక్రయించి లబ్ధి పొందాలని విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మెంట్రాజ్‌పల్లి సహకార సంఘం వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లబ్ధిపొందాలన్నారు. రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు.

మాక్లూర్: రైతులు తాము పండించిన పంట లను దళారులను నమ్మి మోసపోవద్దని ధాన్యాన్ని ప్రభుత్వమే కొను గోలు చేస్తుందని మాక్లూర్ సొసైటీ చైర్మన్ బూరొల్లా అశోక్ అన్నారు. గురువారం ఆలూర్ మండలంలోని డీకంపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు శేఖర్, డైరెక్టర్లు దయాకర్‌రావు, చిన్నయ్య, నాయకులు శ్రీకాంత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి పంచాయతీ పరిధిలోని అంజుమాన్ ఫారం, నవీపేట, నాగేపూర్‌లలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అంజుమాన్ ఫారంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం భూమేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, ఉమా మహేశ్వర్ రావు, నారాయణ, సాయిలు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. నవీపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించగా ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అబ్బన్న, వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, ఏవో నవీన్ కుమార్, కార్యదర్శి మహేష్, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు. అలాగే నాగేపూర్‌లో జరిగిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో సొసైటీ చైర్మన్ శైలేష్ కుమార్, ఏవో తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఐడీసీఎంఎస్ మేనేజర్ నగేష్ రైతులను కోరారు. సిరికొండ మండలం రావుట్ల గ్రామంలో ఐడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం నగేష్ ప్రారంభించారు.రైతులను ఉద్దేశించి నగేష్ మాట్లాడుతూ ప్రభు త్వం మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నందున రైతులందరు కొను గోలు కేంద్రాల్లోనే తమ దాన్యాన్ని అమ్ముకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో రైతులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,సామెల్ శివాజీ, విఠల్,రాజేంద్రప్రసాద్, బాస్కర్,పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ మండలంలోని బర్దీపూర్ గ్రామంతో పాటు సాలూర గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. బర్దీపూర్‌లో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, ఐకేపీ సెంటర్ ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, సీఈవో బస్వంత్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, రైతులుపాల్గొన్నారు.

కోటగిరి: ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు తహసీల్దార్ గంగాధర్ వెల్లడించారు. కోటగిరి మండలంలో గురువారం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను తహసీల్దార్ పరిశీలించారు.

ఇందల్వాయి:మండలంలోని నల్లవెల్లి గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వరి కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ నోముల శ్రీనివాస్‌రెడ్డి గురువారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నోముల శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు శశిధర్‌రెడ్డి, పూదారి మనోహర్, సీఈవో తేజాగౌడ్, కోశాధికారి పిప్పరి చిన్నరాజన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఒడ్డెరాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామసుమన్,గంగాధర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మోర్తాడ్:మండలంలోని వడ్యాట్ గ్రామంలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం ప్రమీలా, మార్కెట్ కమిటి డైరెక్టర్లు మహిపాల్, నవీద్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీలు తడకల శ్రీనివాస్, మహేందర్, వీవోఏలు స్వప్న, సుజాత, రాకేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికలలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలి

● ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తప్పకుండా అమలు చేయాలని, మే 24, 26వ తేదీల్లో బోధన్ పట్టణంలో దివ్యాంగుల చట్టాలు, సంక్షేమ పథకాలపై రాష్ట్ర సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య తెలిపారు. 33జిల్లాల నుంచి 500మంది ప్రతినిధులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరైన విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్లాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో చట్టం తేవాలని డిమాండ్ చేశారు. బోధన్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సదస్సుకు వికలాంగులు అధిక సంఖ్యలో హాజరైన విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బస్వరాజ్, జిల్లా అధ్యక్షులు గైని రాములు, జిల్లా కార్యదర్శి ఏశాల గంగాదర్, షేక్.నజీర్, ఎంపీఆర్‌డీ మహిళ విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మి, భాను, నాయకులు రాజయ్య, పాల్గొన్నారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి



భీమ్‌గల్‌లో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

భీమ్‌గల్‌టౌన్,ఏప్రిల్03(ఆంధ్రజ్యోతి):ఫ్లెక్సీ విషయంలో లక్ష్మీనారాయణపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. తన దుకాణానికి అడ్డుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని మూడు రోజుల తర్వాత తొలగించిన లక్ష్మీనారాయణపై అకారణంగా దాడి చేయడం హేయమైన చర్య అని కనుక నిందితులను అదుపులోకి తీసుకొని కఠిన చర్యలు చేపట్టాలని నినాదాలు చేపట్టి రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న సీఐ సత్యనారాయణ గౌడ్, భీమ్‌గల్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి ఎస్సైలు మహేష్, రాము సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ ధర్నా లో బీజేపీ మండల నాయకులు ఆరె రవీందర్, నర్సయ్య, మహిపాల్, కొట్టాల అశోక్, సంధ్య రాజ్ తదితరలు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ వివాదంలో నలుగురిపై కేసు నమోదు

భీమ్‌గల్,ఏప్రిల్03(ఆంధ్రజ్యోతి):భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో బుధవారం రాత్రి జరిగిన ఫ్లెక్సీ విషయానికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బస్టాండ్ సమీపంలో వేల్పూర్ రోడ్డులో గల భాగ్యలక్ష్మీ ఎంటర్ ప్రైజెస్ వద్ద ఒక వర్గానికి చెందిన వారు ఫ్లెక్సీని ఏర్పాటు చేసుకున్నారు. మూడు రోజులు దాటడంతో అట్టి ఫ్లెక్సీని తీసివేశాడని బుదవారం రాత్రి దాడి చేయడంతో బాధితు డు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో వ్యవసాయ కూలీ మృతి

నవీపేట,ఏప్రిల్03(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన గోనేవార్ గంగాధర్(49)అనే వ్యవసాయ కూలీ గురువారం ప్రమాదవశాత్తు స్థానిక గోదావరిలో మునిగి మృతి చెందాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. గ్రామంలోని ఒక రైతుకు చెందిన కరెంట్ మోటారు గోదావరి నదిలో పాడైపోవడంతో దానిని బయటకు తీయడానికి గంగాధర్ కూలీ పనికి వెళ్లాడని అన్నారు. ఇదే సమయంలో అతడు జారి నదిలో పడిపోవడంతో ఊపిరాడక మృతి చెందాడని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి భార్య ఛాయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

ఎడపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామంలో అనుమానాస్పదంగా ఓమహిళ మృతి చెందిందని ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామనికి చెందిన పురిమేటి లక్ష్మి(35) అనే మహిళ ఈ నెల 1వ తేదీన నిజామాబాద్ వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లిందని కాని గురువారం రోజున వాళ్ళ పంట పొలం దగ్గర పంటకాలువలో శవంగా కనిపించే సరికి మృతురాలి అన్న పురిమేటి నాగయ్య పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిమిత్తం శవాన్ని బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ప్లాస్టిక్ రహిత మున్సిపాల్టిగా తీర్చిదిద్దుదాం

ఆర్మూర్ టౌన్ , ఏప్రిల్03(ఆంధ్రజ్యోతి):ప్రతీ ఒక్కరు సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను నిషేధించి ప్లాస్టిక్ రహిత మున్సిపాల్టిగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ సానిటరి ఇన్‌స్పెక్టర్ గజానంద అన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు పట్టణంలోని 35వ వార్డులో తడి, పొడి హానికరమైన చెత్తపై మహిళలకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు చెత్తను మున్సిపల్ ట్రాక్టర్‌కు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్ నర్సయ్య, ఆర్‌పి పల్లవి, గంగమణి, దీప, వనిత, యమున, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ధర్నా

ఆర్మూర్ టౌన్ , ఏప్రిల్03(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కా ర్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో గురువారం 36వ వార్డులలో స్థానిక సంస్థలు పరిష్కరించాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉందని పలు వార్డులలో డ్రైనేజీలు సరిగా లేక నీరు నిలిచిపోతుందని, సుందరయ్య కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కూతడి ఎల్లయ్య, నాగరాజు, సుజాత, నవీన్, లాల్యానాయక్, రఫీకన్, శర్మ, రజియ, రషిద, మౌలాన పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహార్‌బాద్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ రోడ్డ సురేష్ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను గురువారం మాజీ ఎంపీపీలు కే. అనంత్‌రెడ్డి, డికొండ హరిత శ్రీనివాస్‌లు పరామర్శించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి, మనోధైర్యాన్ని కల్పించారు. వారివెంట మాజీ మండల కోఆప్షన్ సభ్యులు అక్బర్ ఖాన్, బాలయ్య, రోడ్డ సాయన్న ఉన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



జాన్కంపేట్ లో పాదయాత్రలో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి



మోర్తాడ్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాలరాస్తున్న మోదీ సర్కార్

● నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాలరాయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మండిపడ్డారు. గురువారం మోపాల్ మండల కేంద్రంలో జైబాపు.. జైభీం.. జై సంవిధాన్.. యాత్రను ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అందరికి సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాణ అంబేద్కర్ ఆలోచనలను మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కేందుకు ప్రయత్నిస్తుందన్నారు. మహాత్మ గాంధీ అంబేద్కర్‌లు దేశ అభివృద్ధి కోసం ఎంతో కృషిచేశారని అందరికి సమన్యాయం జరిగే విధంగా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని పేర్కొన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని అన్నారు. పేదరిక నిర్మూలన కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషిచేస్తుందని అన్నారు. మోదీ సర్కార్ నల్లచట్టాలను తీసుకువచ్చి రైతాం గాన్ని అణచివేసే విధంగా ప్రయత్నిస్తుందన్నారు. నల్లచట్టాలకు వ్యతిరేకంగా కేంద్రంలో రైతులు పెద్దఎత్తున ఉద్యమించడం వల్లే కేంద్రం వెనుకడుగు వేసిందని గుర్తుచేశారు. మోది ప్రభుత్వం కుల మతాలను రెచ్చగొట్టి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన జైబాపు.. జైభీం.. జై సంవిధాన్.. యాత్ర దేశ వ్యాప్తంగా ప్రారంభ మైందని అన్నారు. ఈ యాత్ర ప్రతి గ్రామంలో తిరుగుతూ కేంద్ర ప్రభు త్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయాలనే ఆలోచనతో రాహుల్‌గాంధీ, సోనియాలు ఈ యాత్రను ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగా రెడ్డి, పీసీసీ డెలిగెట్ చంద్రశేఖర్ గౌడ్, యాత్ర ఇంచార్జి లింగం, జిల్లా కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షులు యాదగిరి, పార్టీ అధ్యక్షులు సాయిరెడ్డి, సొసైటీ చైర్మన్లు మోహన్‌రెడ్డి, గంగారెడ్డి,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్:ఆర్మూర్ మండలం గోవింద్ పేట్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు హాజరైన ఎస్టీ కార్పోరేషన్ చైర్మన్ తిరుపతి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్‌రెడ్డి, టీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా అందరికి సమాన హక్కులు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ చైర్మన్ బుల్లెట్ రమేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గంగాధర్, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జైబాపు జైభీమ్ జై సంవిధాన్ ముగింపు కార్యాక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపరచాలని చూస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆడెం గంగాప్ర సాద్, గడ్డం జీవన్, బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, ముస్కు మోహన్, మునిమాణిక్యం అజయ్, దండెవోయిన సాయి కుమార్, ఎండి మునీరుద్దీన్, రేండ్ల రమేష్, రేండ్లరాజారెడ్డి, శాంసన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేల్పూర్ :అంబేద్కర్ తో పాటు ఎందరో మహాను బావుల ఆలోచనలో నుంచి పుట్టిన అతి పవిత్రమైన రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. గురువారం వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో ఏఐసీసీ పిలుపు మేరకు జైబాపు, జైభీమ్, జైసంవిదాన్ పాదయాత్రను ఆయన ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు జేమ్స్ గంగారెడ్డి, శెట్టి వినోద్, నర్సింహం, శ్రీనివాస్, గాంధీ, జీజీ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోర్తాడ్:కేంద్ర ప్రభుత్వంరాజ్యాంగాన్ని బలహీన పర్చాలని చూస్తుందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జైబాపు, జైభీమ్, జైసంవిదాన్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. అంత కు ముందు మోర్తాడ్‌లోని ప్రధాన వీదుల్లో జైబాపు, జైభీమ్, జైసంవిదాన్ నినాదాలు చేస్తు బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్‌కు మార్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. అనం తరం పద్మశాలి సం ఘం జరిగిన ముగింపు సమావేశంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడు తూ గత పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వా మ్యంపై దాడి చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపా ధ్యక్షుడు శివనోల్ల శివకుమార్, వెల్మ బాస్కర్ రెడ్డి, పుప్పాల అశోక్, పాల్గొన్నారు.

నంది పేట: మండలంలోని షాపూర్, బజార్ కొత్తూర్ గ్రామాల్లో గురువారం డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయ కులు పాదయాత్రలు చేశారు. అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు మహాత్మా గాంధీ, అంబేద్కర్ ఫోటోలతో జై బాపు, జై బీమ్, జై సంవిదాన్ నిర్వహిం చారు. ఇందులో భాగంగా మహనీయుల విగ్రహాలకు పూల మా లలు వేసి, కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగిరవేశారు. ఈ కార్యక్రమంలో మం డల పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, ఐలాపూర్ పీఏసీఎస్ చైర్మెన్ మీసాల సుదర్శన్, చింరాజ్‌పల్లి వైస్ చైర్మెన్ తేలు నర్సయ్య డైరెక్టర్‌లు ఉన్నారు.

బోధన్‌రూరల్: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని, ప్రజలను జాగృతం చేయడానికే కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర చేపట్టిందని బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యనారాయణ గౌడ్ అన్నారు. బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి తదితర ప్రాంతాలతో పాటు బర్దీపూర్, పెంటాకలాన్ తదితర గ్రామాలలో గురువారం జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ పాదయాత్రను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, హరికాంత్ చారి, ఆదినారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎల్లమయ్య, మాజీ కౌన్సిలర్లు శరత్ రెడ్డి, శ్రీకాంత్, దాము, వీరభద్రరావు, తలారి నవీన్, గుండెటి శంకర్, పాల్గొన్నారు.

కోటగిరి: భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు జావేద్ అక్రమ్ ఆరోపించారు. కోటగిరి మండలంలో గురువారం జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వల్లభాపూర్, యాద్గార్‌పూర్, ఎత్తొండ గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మనోహర్, షాహిద్, సాయిబాబా, సలీం, మధు, ఆనంద్, సాయన్న పాల్గొన్నారు.

మెండోర:అందరి భవిష్యత్ కోసం జైబాపు జైబీమ్, జైసంవిదాన్ పాదయాత్రను వేల్పూర్ మార్కెట్ కమిటి చైర్మన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యం రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సలీం, సోం రాజేందర్, బద్ది సాయి, మౌలానా, మురళి, మధు, రాము, దేవేందర్, రవి, శ్రీనివాస్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:మండలంలోని అమీర్‌నగర్, నర్సాపూర్, ఇనాయత్ నగర్ గ్రామంలో గురువారం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, బాల్కొండ నియోజికవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్, ఐడిసి ఎమ్మెస్ చైర్మన్ బదావత్ తారాచంద్ జిల్లామడల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్రలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సుంకెట రవి, మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్య, జిల్లా కార్యదర్శి తక్కూరి దేవేందర్, నాయకుడు పడిగెల ప్రవీన్, తక్కూరి దేవేందర్, జక్కుల రాజన్న, పాల్గొన్నారు.

వర్ని: రాజ్యాంగ పరిరక్షణ కోసం పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ కొట్నాక్ తిరుపతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్ని మండల కోఆర్డినేటర్ మాజీ ఎంపీపీ గంగాశంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ బాబా, పీసీసీ డెలిగేట్ డాక్టర్ కూనిపూర్ రాజారెడ్డి, మాజీ జడ్పీటీసీ హరిదాస్, రాష్ట్ర మైనారిటీ నాయకులు మహమ్మద్ భారీ, కిసాన్ ఖేత్ ఇన్‌చార్జి శనిగరం కిషన్, కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

డొంకేశ్వర్: భారతదేశాన్ని,రాజ్యాన్ని కాపాడు కుందాం అంటూ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ఆదేశానుసారం డొంకేశ్వర్ మండలంలోని తొం డాకూర్, దత్తాపూర్, మారం గంగసారం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నా యకులు జైబాపు, జైబీమ్, జైసంవిదాన్ పాదయాత్రను నిర్వహించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు భూమేష్‌రెడ్డి, మారంప్లి లిఫ్ట్ చైర్మన్ బోజారెడ్డి, రమణ, దేగాం గంగారెడ్డి, వైఎస్ గంగాదర్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్:ఏఐసీసీ ఆదేశాల మేరకు జైబాపు, జైబీమ్, జైసంవిదాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం వేల్పూర్ మండలం లక్కోర, అమీనాపూర్, హన్మాన్ నగర్‌లో కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనీల్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు జేమ్స్ గంగారెడ్డి, సౌడ శ్రీనివాస్, రమన, చరణ్; నరేందర్, రాము, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని జన్నేపల్లి, నాడాపూర్, గాంధీనగర్ తదితర గ్రామాలలో గురువారం కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలలో పాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ విశిష్టత గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతి



డొంకేశ్వర్‌లో..



మెండోరలో పాదయాత్ర పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



బజార్ కొత్తూర్‌లో..


మిర్జాపూర్‌లో బయట పడిన ద్వారకా పాలకుడి విగ్రహం


విగ్రహానికి పూజలు చేస్తున్న సీఐ రాజేష్

మిర్జాపూర్‌లో బయటపడిన ద్వారకా పాలకుడి విగ్రహం

నసురుల్లాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో ద్వారకా పాలకుడి పురాతన విగ్రహం బయటపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే గ్రామస్థులు తెలిపిన వివరణ ప్రకారం. గ్రామంలోని మైనారిటీ శ్మశాన వాటిక సమీపంలో పురాతన విగ్రహం కొద్దిగా బయటపడడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందజేశారు. గురువారం రూరల్ సీఐ రాజేష్, ఎస్సై లావణ్యతో సహా పోలీసులు గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో కలిసి పురాతన విగ్రహాన్ని తవ్వి బయటకు తీశారు. కాగా ఈ విగ్రహం ద్వారకా పాలకుడి విగ్రహంగా గ్రామస్థులు గుర్తించారు. అనంతరం గ్రామస్థులు అందరూ కలిసి హనుమాన్ ఆలయంలో విగ్రహాన్ని పెట్టి పూజించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఈ బయటపడిన విగ్రహం ద్వారకా పాలకుడు అంటే పురాతన కాలంలో గ్రామానికి నాలుగు దిక్కులు రక్షకుడిగా ఉండేవాడన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై లావణ్య పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు.

గ్రామీణ ప్రజలను చైతన్యవంతం చేయాలి



ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లో మాట్లాడుతున్న టీయూ వీసీ యాదగిరిరావు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేస్తూ సమాజ శ్రేయస్సు కోసం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా పనిచేస్తున్న ఎన్ఎస్ఎస్ యూనిట్ - 1, 4 విద్యార్థులందరూ సమాజ శ్రేయస్సు కోసం తమవంతు చేయూతనందించాలని టీయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు సూచించారు. గురువారం సుద్దపల్లి గ్రామంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల, పీఆర్వో పున్నయ్యతో కలిసి వేసవికాల ప్రత్యేక శిబిరాన్ని సుద్దపల్లిలో వారం రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని వీసీ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని విద్యార్థులు కేవలం అకాడమిక్ బోధన పరంగానే ఉండకుండా సంఘ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుకు రావాలన్నారు. యూనివర్సిటీ పీఆర్వో పున్నయ్య మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజం పట్ల గౌరవ భావాన్ని పర్యావరణం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రిన్సిపల్ మామిడాల ప్రవీణ్ మాట్లాడుతూ ఈనెల 3 నుంచి 10 వరకు గ్రామంలో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్రామీణ ప్రజలు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు చేయూతనందించాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ విద్యార్థులంతా సమాజ సేవ కోసం ముందుకు వచ్చేందుకే ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రూపా సతీష్, కార్యదర్శి కవిత, వాలంటీర్లు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే ఆశయసాధన కోసం కృషి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థిని, విద్యార్థులు జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం చేయూతనందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని టీయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి, ప్రిన్సిపల్ మామిడాల ప్రవీణ్‌లు అన్నారు. గురువారం విశ్వవిద్యాలయంలో యూజీ సెల్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల్లో భాగంగా భారత జాతీయ అభివృద్ధి అనే అంశంపై 11న సెమినార్ నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ ఆంజనేయులు, డాక్టర్ నీలిమ, డాక్టర్ పున్నయ్య, డాక్టర్ స్వప్న, రిటైర్డ్ హైకోర్టు జడ్జి సీతారామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్‌లు

సీతారామ లక్ష్మణ ఆంజనేయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన


గుంజిలిలో పూజలు నిర్వహిస్తున్న వినయ్ కుమార్ రెడ్డి

మాక్లూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజిలి గ్రామంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ సమేత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్ రెడ్డి గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీతో గ్రామ కమిటీ వారు రామాలయ అభివృద్ధికి నిధులు కావాలని వినయ్ కుమార్‌రెడ్డి దృష్టికి తేగ ప్రభుత్వం నుంచి మందిర కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాక్లూర్ సొసైటీ చైర్మన్ అశోక్, డైరెక్టర్ దయాకర్‌రావు, ఐలాపూర్ మాజీ సొసైటీ చైర్మన్ సుదర్శన్, సొసైటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, నాయకులు శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.


గ్రామం నుంచి బ్రిడ్జి వరకు పూర్తయిన హసాకొత్తూర్-మెట్ల చిట్టాపూర్ రహదారి


లోతట్టు వాగుపై నిర్మించిన బ్రిడ్జి


అసంపూర్తిగా మిగిలి ఉన్న హసాకొత్తూర్-మెట్ల చిట్టాపూర్ రహదారి

అసంపూర్తిగా రెండు జిల్లాల వారధి

● రూ.3 కోట్ల 25 లక్షలతో ఐదు కిలోమీటర్ల రహదారి, బ్రిడ్జి నిర్మాణాలు పూర్తి ● ఇక మిగిలింది కిలోమీటర్ రహదారి మాత్రమే ● పనులు పూర్తిచేయించాలని కోరుతున్న గ్రామస్థులు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హసాకొత్తూర్ నుంచి జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్ రహదారి అసంపూర్తిగా మిగిలి ఉండడంతో ప్రయాణాలు సాగించే స్థానిక రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు. రెండు జిల్లాలకు వారధిగా నిలిచే ఈ రహదారి కోసం హసాకొత్తూర్ గ్రామస్థులు, ఈ ప్రాంత రైతులు కొంత కాలంగా ఎదురుచూస్తున్నా అప్పటి నాయకులు పట్టించుకోలేదు, ఈ రహదారి ఆవశ్యకతను గుర్తించిన అప్పటి మిషన్ భగీరథ వైస్ చైర్మన్ మాజీమంత్రి ప్రస్తుత బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామం నుంచి మెట్లచిట్టాపూర్ గ్రామ రహదారి వరకు సుమారు 6 కిలోమీటర్ల బీటీ రహదారితోపాటు లోతట్టు వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం 3 కోట్ల 25 లక్షల సీఆర్ఆర్ నిధులు మంజూరు చేయిచి 2018 జూన్11న శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అయితే గ్రామం నుంచి ఐదు కిలోమీటర్ల దూరం వరకు బీటీ రోడ్డు, లోతట్టు వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయినా మిగిలిన కిలోమీటర్ రహదారి బీటీకి నోచుకోలేదు. అక్కడున్న ఇద్దరు రైతులు వివాదం మధ్య పనులు నిలిచిపోయాయి. చౌట్‌పల్లి, హసాకొత్తూర్ ఇరుగ్రామల వారు రైతుల మధ్య సయోధ్య కుదుర్చడంతో వివాదం సద్దుమనిగింది మంజూరైన 3 కోట్ల 25 లక్షల రూపాయలు 5 కిలోమీటర్ల బీటీ రోడ్డు, బ్రిడ్జి పనులకు నిధులు సరిపోవడంతో మిగిలిన కిలోమీటర్ రహదారి పనులకు తిరిగి నిధులు అవసరమయ్యాయి. ఇందుకోసం ప్రతిపాదనలు సైతం రాష్ట్ర ప్రభుత్వానికి అందాయి. కాని అంతలోనే ఎన్నికలు రావడం... ప్రభుత్వం మారడంతో నిధుల మంజూరు నిలిచిపోయింది. దీంతో రెండు గ్రామాల వారధిగా ఉపయోగపడే హసాకొత్తూర్ - మెట్ల చిట్టాపూర్ రహదారి కిలోమీటర్ మేర అర్ధంతరంగా నిలిపోయింది.

● నిధులు మంజూరు చేయించి పనులు పూర్తిచేయించాలి

ధర్పల్లి సతీష్, వీడీసీ అధ్యక్షుడు, హసాకొత్తూర్



హసాకొత్తూర్- మెట్ల చిట్టాపూర్ రహదారి మిగులు పనులకు నిధులు మంజూరి చేయించి పనులు పూర్తి చేయించాలని ఈ ప్రాంత రైతులకు ఎంతగానో ఉపయోగపడే రహదారి పట్ల సంబంధిత శాఖ అధికారులు, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ప్రత్యే శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది.

● ఈ రహదారి రెండు జిల్లాలకు వారధి: దొడ్డాయి లక్ష్మణ్, రైతు, హసాకొత్తూర్

హసాకొత్తూర్- మెట్ల చిట్టాపూర్ రహదారి రెండు జిల్లాలు నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు వారధిలాంటిది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వెల్లడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మంజూరైన నిధులు ఐదు కిలోమీటర్ల బీటీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణాలకు సరిపోగా మిగిలిన కేవలం ఒక కిలోమీటర్ రహదారికి నిధులు లేక అర్ధాంతరంగా నిలిచింది. ప్రజాప్రతినిధులు అటు రైతులకు, ఇటు గ్రామస్థులకు ఎంతగానో ఉపయోగపడే ఆవశ్యకతను గుర్తించి నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టాలి.

● రహదారి మిగులు పనులకు సర్వే జరిగింది :మేఘన, ఏఈ, పీఆర్

హసాకొత్తూర్ - మెట్ల చిట్టాపూర్ రహదారి మిగులు కిలో మీటర్ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం అయితే ఇటీవలే సర్వే కూడా జరిగింది. త్వరలోనే నిధులు వచ్చే అవకాశం ఉంది. నిధులు మంజూరు కాగానే పనులు యుద్ధ ప్రాతిపాదికన ప్రారంభిస్తాం.

ఉపాధి కూలీలకు ఉపశమనం

● కూలి రూ.300 నుంచి రూ.307కు పెంచిన కేంద్ర ప్రభుత్వం


మద్నూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు కేంద్ర ప్రభుత్వం కూలీ రేట్లను ఈ ఆర్థిక సంవత్సరంలోకూలీలకు చెల్లించే దినసరి కూలీ రేటును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఉపాధికూలీలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో రోజు వారి కూలీ డబ్బులను రూ.300 నుంచి రూ.307లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ ఒకటి నుంచి పెంచిన కూలీ రేటు అమలులోకి వచ్చినట్లు ఏపీవో పద్మ తెలిపారు. వలసలకు అడ్డుకట్ట వేసి గ్రామాల్లోనే పనులుచూపేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని 2005 కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ప్రారంభంలో దినసరి కూలీ 87.50లు, పదేళ్ళ కిందట వరకు ఆ మొత్తం రూ. 193లకు వరకు ఉండేది. అనంతరం కూలీ ఏటా రూ. 10 నుంచి 30 వరకు పెంచుతూ వచ్చింది. 2022లో రూ.12లు పెంచగా 2023లో రూ. 15 వేలు అదనంగా చెల్లించింది. 2024లో రూ.28లు కూలీ రేట్లను పెంచింది. ఈ ఏడాది మాత్రం కేవలం రూ. 7లకే పెంపును పరిమితం చేసింది. ఈ మేరకు దినసరి కూలీ రూ.300 నుంచి 307లుగా నిర్ణయించి కేంద్రం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.


ఉత్సాహంగా ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 250222 జాబ్ కార్డు కలిగి ఉండగా 12,5001 కార్డుల వారు పనిచేస్తున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో 15,210 జాబ్ కార్డులు ఉండగా 6358 జాబ్ కార్డుల వారు ఉపాధి కూలీ పనులకు వస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ముందస్తుగానే ఆరో విడత తాగునీటి విడుదల

● ఇష్టారాజ్యంగా అధికారులు రూపొందించిన ప్రణాళిక


నిజాంసాగర్‌లో అడుగంటిన నీటి సామర్థ్యం


కొనసాగుతున్న ప్రధాన కాలువ నీటి విడుదల

నిజాంసాగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉభయ జిల్లాల వరప్రదాయిని నిజాంసాగర్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు నుంచి యాసంగి సాగుకు నీటిని విడుదల చేసేందుకు నీటి పారుదల శాఖ అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించారు. అధికార యంత్రాంగం ప్రణాళిక బద్ధంగా నీటిని విడుదల చేయకుండా ఇష్టారాజ్యంగా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి యాసంగికి ఆరు విడతలుగా నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి 11.395 టీఎంసీలు నీటిని విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందించిన విషయం తెలిసిందే. నీటి పారుదల శాఖ అధికారులు యాసంగికి సంవత్సరం డిసెంబరు 13న మొదటి విడత నీటిని విడుదల చేశారు. ఆరు విడతలుగా నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తే ఆయకట్టు కింద వేసిన వరి పంట చేతికొంచే అవకాశం ఉంటుందని అధికారులు వెల్లడించారు. అధికార యంత్రాంగం ఇష్టారాజ్యంగా వివరిస్తూ ప్రణాళిక ప్రకారంగా నీటిని విడుదల చేయటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరో విడత ఏప్రిల్ 6న నీటిని విడుదల చేయాల్సి ఉండగా అధికారులు ముందస్తుగానే ఏప్రిల్ 2న నీటిని విడు దల చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి సాగుకు 11.395 టీఎంసీల విడుదల చేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 145 అడుగులకు గాను 1394.44 అడుగుల నీటి సామర్థ్యం కలిగి 17. 802 టీఎంసీలకు గాను 6.463 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువ వెంట ఆరో విడత పేరిట వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మెండోరలో కంపు కొడుతున్న డ్రైనేజీలు

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మెండోర గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగు కాలువల్లో చెత్తా చెదారం నిండిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి రోగాల భారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని 12వ వార్డు ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు శుభ్రం చేయక రెండేళ్లు అవుతుందని ఎన్నిసార్లు గ్రామ పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే ఈ వార్డుకు మిషన్ భగీరథ నీరు రాక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని నీటిని దూర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటు న్నామని కాలనీవాసులు తెలిపారు. అలాగే డ్రైనేజీ ఈ కాలనీ వరకు నిర్మించి వదిలేశారని దీనితో మొత్తం మురుగునీరు అక్కడికి వచ్చి చేరి ఒక కుంటల ఏర్పడింది. దర్వాసన సమస్యలతో కాలనీవాసులు బయటకు రావడానికి భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువలు శుభ్రం చేసి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ నీటిని ఎస్సీ కాలనీకి వచ్చేట్లు చూడాలని కోరుతున్నారు.



చెత్తా చెదారం, పిచిమొక్కలతో నిండిన డ్రైనేజీలు

చిట్టాపూర్, సుర్భిర్యాల్ లిఫ్ట్ పనులు ప్రారంభం

● పథకం ద్వారా 9274 ఎకరాలకు సాగునీరు
● హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ నుంచి బాల్కొండ నియోజకవర్గంలోని చిట్టాపూర్, ఆర్మూర్ నియోజక వర్గంలోని ఫత్తేపూర్, సుర్భిర్యాల్ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఎత్తిపోథల పథకం ద్వారా 9274 ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. కొన్నేళ్లుగా తమకు సాగునీరు అందించడానికి లిఫ్టును ఏర్పాటు చేయాలని రైతులు కోరుతు వచ్చారు. ఎట్టకేలకు ప్రభుత్వం ఈ పథకం పనులకు శ్రీకారం చుట్టింది. ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి శివారులోని గోదావరి తీరం ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నుంచి పైప్‌లైన్ ద్వారా కోమన్‌పల్లిలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మించనున్న ఇంటెక్‌వెల్‌లోనికి నీటిని తరలించారు. అక్కడి నుంచి పైప్‌లైన్ ద్వారా సుర్భిర్యాల్, ఫత్తేపూర్, చిట్టాపూర్ గ్రామాలోని డిస్ట్రిబ్యూటర్లకు తరలించి అక్కడి నుంచి చెరువుల్లోకి, నేరుగా రైతుల పంట పొలాలకు సాగునీటిని అందించనున్నారు.

● రూ. 150 కోట్ల ప్రాజెక్టు

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఎత్తిపోతల పథకానికి 150 కోట్లు కేటాయించింది. ఇందులో బాల్కొండ నియోజకవర్గంలోని చిట్టాపూర్, శ్రీరాంపూర్, బాలొండ గ్రామాలకు రూ.60 కోట్లతో 3474 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆర్మూర్ నియోజకవర్గంలోని ఫత్తేపూర్, సుర్భిర్యాల్ గ్రామాలకు రూ. 90 కోట్లతో 5800 ఎకరాలకు ఈ లిఫ్ట్ ద్వారా సాగునీరు అందించాలని ప్రణాళిక రూపొందించారు. పనులు వేగవంతం చేసి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేస్తే రైతులకు ఎంతో మేలు జరగనుంది.

ఘనంగా విష్ణుమూర్తి స్వామి వార్షికోత్సవం

● అలరించిన కుస్తీ పోటీలు



మోస్రా, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చందూర్ మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో కరంగోళ స్వామి(విష్ణుమూర్తి)4వ వార్షికోత్సవ ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. గురువారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి అన్నప్రసాదం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలు నిర్వహించారు. కుస్తీపోటీలకు చుట్టు పక్కల గ్రామాల మల్లయోధులతో పాటు మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాల నుండి మల్లయోధులు తరలివచ్చి పాల్గొన్నారు. చివరి కుస్తీ 2వేల రూపాయల నగదును గెలుపొందిన మల్లయోధుడు జగదీష్‌కు ఆలయ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, డైరెక్టర్లు, గ్రామ పెద్దల చేతుల మీదుగా బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఆయా మండలాల నుండి ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

మోకన్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



మోకన్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

నవీపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో గురువారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీఎంశ్రీ యోజన కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బాలికల విద్య అవశ్యకతపై నిర్వహించిన నాటిక అందరిని ఆలోచింపజేసింది. పాఠశాలకు చెందిన విద్యార్థినులు కరాటే మార్షల్ ఆర్ట్స్ పరేడ్‌ను నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థిని శిరీష ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నందున ఆమెతో పాటు ఆమె తండ్రిని ఉపాధ్యాయ సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అశోక్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు భూమయ్య, ప్రధాన కార్యదర్శి శివకుమార్, జీఈసీవో భాగ్యలత, పాఠశాల ప్రత్యేక అధికారిణి కవిత, పలువురు స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

వక్ఫ్ బిల్లుపై ప్రతిపక్షాలవి అనవసర రాద్ధాంతం

• బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

కామారెడ్డిటౌన్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లుపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు అధ్యక్షతన కార్యాలయంలో పార్టీ పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగేలా కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లుపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని ముస్లింలకు ఈ బిల్లు ద్వారా ఎలాంటి నష్టం జరగదని అన్నారు. అధికారంలోకి వస్తే దేశానికి మంచి చేయడమే బీజేపీ పని అని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనేక సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుందని అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లాలోని ప్రతీ బూత్‌లో నిర్వహించాలని, ప్రతీ కార్యకర్త ఇంటిపై బీజేపీ జెండా ఎగురవేయాలని అన్నారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ గారి కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలని అన్నారు. బీజేపీ కార్యకర్తకి దేశం ప్రథమం, పార్టీ ద్వితీయం ఆ తర్వాతే కుటుంబమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అరుణతార, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, రంజిత్ మోహన్, పైలా కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'హెచ్‌సీయూ భూములను అమ్మితే సహించం'

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో గల సెంట్రల్ యూనివర్సిటీ భూములను రాష్ట్ర ప్రభుత్వం అమ్మితే సహించబోమని బీజేపీ మండల నాయకులు హెచ్చరించారు. హెచ్‌సీయూ భూముల అమ్మకానికి వ్యతిరేకంగా నిరసిస్తూ పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. వేలాదిమంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ భూములను ప్రభుత్వం అమ్ముకోవడం దుర్మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు సంజీవ్ పటేల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సుభాష్, నాయకులు హన్మండ్లు, తానాజీ, ప్రేమ్‌సింగ్, అశోక్ పటేల్, రాములు, నాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వంలో జంతువులు, సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడుతోందని బీజేవైయం జిల్లా అధ్యక్షుడు నందివేణు అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరు చూపు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరుగుతున్న అన్యాయం వైపేనని, ఓవైపు విద్యార్థిసంఘాలు, ప్రతిపక్ష నేతలు యూనివర్సిటీలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తే రేవంత్‌రెడ్డి సర్కార్ నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తున్న తీరును ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లాఠీచార్జ్ చేయడాన్ని, హెచ్‌సీయూ కార్యక్రమంలో బీజేవైయం నాయకుల పట్ల పోలీసుల ప్రవర్తన విధానాన్ని జిల్లాబీజేవైయం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, విపుల్‌జైన్, భరత్, లక్ష్మీపతి, రాజేష్, రాజగోపాల్, సురేష్, సంజయ్, నవీన్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో మోడీ చిత్రపటం పెట్టాలని వినతి

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో దేశ ప్రధాని మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల బీజేపీ నాయకులు తహసీల్దార్ దశరథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల బీజేపీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేదలకు రేషన్‌దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం నిధుల్లో కేంద్రం వాటా అధికంగా ఉందని అన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులతో బియ్యం పంపిణీచేస్తున్న రాష్ట్రప్రభుత్వం ఈ ఘనతను తమదిగా చెప్పుకోవడం విడ్డూరమన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీని హుజూర్‌నగర్‌లో ప్రారంభిస్తే కనీసం దేశ ప్రధాని ఫొటో పెట్టకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.

బీర్కూర్‌లో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు

బీర్కూర్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగసాయుధ పోరాట యోధుడు, భూమి కోసం భుక్తి కోసం జాతి విముక్తి కోసం ప్రాణాలు ఒడ్డిన తెలంగాణ ముద్దుబిడ్డ దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను గురువారం బీర్కూర్‌లో ఘనంగా నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. తెలంగాణ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన గొప్ప వ్యక్తని కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీరుగొండ, మష్టగొండ, బీరుగొండ, పీరుగొండ, ప్రవీణ్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లి గ్రామంలో బుధవారం మండల కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలను అభివృద్ధి చేసే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతీ పేదవారికి ప్రభుత్వ ఫలాలు అందాలనే ఆశయంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు.

రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ

పేదప్రజల ఆకలిని తీర్చేందుకు ప్రభుత్వం ఉగాది పర్వదినం నుంచి ప్రారంభమైన సన్నబియ్యం పంపిణీని మండల కాంగ్రెస్ నాయకులు విఠల్‌వాడీ గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతు దొడ్డుబియ్యం అక్రమాలకు చెక్ పెట్టాలని ఉద్దేశ్యంతో పాటు, ప్రజలకు సన్నబియ్యం అందించాలనే ఆశయంతో ఈ పథకం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్యామప్ప, మల్లప్ప పటేల్, సంజీవ్, పీరాజీ, మొగులాగౌడ్, ఉత్తమ్‌రావ్, మష్టాజీ పాల్గొన్నారు.

'అక్రమంగా చేపట్టిన నియామకాలను రద్దుచేయాలి'

కామారెడ్డిటౌన్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ ఔట్‌సోర్సింగ్ నియామకాలను రద్దుచేయాలని టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్రకార్యదర్శి బాలు, తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాల నియామకాలు అక్రమమని, ఒక్కో అభ్యర్థి నుంచి రూ.లక్షలు తీసుకుని ఉద్యోగాలను ఇచ్చినట్లు ఆరోపించారు. ఏ ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారో కూడా ఇప్పటివరకు తెలియజేయడం లేదని పేర్కొన్నారు. అవినీతికి పాల్పడిన ఏజెన్సీ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని అర్హులైన వారందరికీ ఉద్యోగాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాలను నిరసిస్తు శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్నిచేపడుతామని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారందరూ రావాలని పిలుపునిచ్చారు. అన్నిరకాల అర్హతలు ఉన్నవారికి ఉద్యోగాలు ఇవ్వకుండా డబ్బులు ఇచ్చిన వారికి ఉద్యోగాలు ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు. అవినీతి కార్యకలపాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క నిరుద్యోగిపై ఉందని, లేకపోతే భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు మరిన్ని పెరిగిపోతాయని ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీరామ నవమి ఉత్సవాలకు ముస్తాబవుతున్న రామాలయం

లింగంపేట, ఎప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలోని రామాలయాన్ని శ్రీరామ నవమి ఉత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు. ఆలయ ధర్మ కర్త గుండ విజయ్ ఆలయానికి వచ్చి గ్రామస్తులతో మాట్లాడారు. ఉత్సవాలకు కావల్సి ఏర్పాట్లను చేయాలని ఆయన వివిద కుల సంఘాల నాయకులతో చర్చించారు. ఆలయం వద్ద పనులు వేగంగా సాగుతున్నాయి. ఈనెల 6న ఎండ్ల ప్రదక్షణ, 7న రథోత్సవం నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.

సమాజ శ్రేయస్సు కోసం పాటుపడేది రైతులే

• ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు


నూతన భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

సదాశివనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు పాటుపడేది రైతులేనని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. గురువారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలోని పీఏసీఎస్‌లో నూతన భవన, వ్యాపారసముదాయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి అభీష్టం మేరకు సన్నబియ్యం పంపిణీ చేపట్టిందని అన్నారు. కుప్రియలో గోదాం ఏర్పాటుకు స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. సహకార సంఘం చైర్మన్ సదాశివరెడ్డి అహర్నిశలు రైతుల సంక్షేమం కోసం పాటు పడుతున్నారని, నిత్యం సహకార సంఘం అభివృద్ధికి వివిధ రకాల నిధుల కోసం నాతో చర్చిస్తు అన్ని నిధులను సాధించేందుకు సఫలీకృతమయ్యారని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం గత 40 ఏళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. ఎల్లారెడ్డి ప్రాంతంలో 90శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవనం గడుపుతున్నారని తెలిపారు. రూ.25కోట్లు ఎల్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా సీసీరోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. గ్రామాల అభివృద్ధి తన లక్ష్యమని, గ్రామాల్లో సమస్యలు ఎదురైనప్పుడు తనను సంప్రదించాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.54వేల కోట్లు వివిధ అభివృది పనులకు ఖర్చు పెట్టిందన్నారు. అడ్లూర్ ఎల్లారెడ్డి సొసైటీ పరిధిలోని 14 గ్రామాలకు వందశాతం సాయిశక్తుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం మండలకేంద్రంలో జ్యోతిరావుఫూలే, సావిత్రిబాయి పూలే, అంబేద్కర్, రమాబాయి, గౌతమబుద్ధుని విగ్రహాలను ఆవిష్కరించారు. అణగారిన జీవితాలు చదువుకు దూరంగా ఉండడంతో చదువు నేర్పిన మహనీయులు అన్నారు. బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంవల్లే నేడు ప్రతీ పౌరుడికి రాజ్యాధికారం దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, జిల్లా ఎస్‌సీసెల్ అధ్యక్షుడు మద్దెల భాగయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సాంగ్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ ఇర్షాదుద్దీన్, లింగాగౌడ్, సంపత్‌గౌడ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హన్మంత్ షిండే

జొన్నలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలి

● మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

పిట్లం, ఏప్రిల్ 3: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే డిమాండ్ చెశారు.గురువారం పిట్లంలో విలేఖరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వర్షానికి రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ఆదుకొవాలని కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సియం కెసిఆర్ రైతుల అభివృద్ధి కొసం మిషన్‌కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరణ చేయడం, చెరువుల కట్టలు, తూములు, మరమ్మతులు చేసి చెరువుల కింద పంటలకు సాగునీరు అందించామన్నారు. రైతులకు గుంట భుమి ఉన్న మరణిస్తె 5లక్షల రైతుబీమా పథకం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. జొన్నల కొనుగోలు ప్రభుత్వం ప్రారంభించి రైతులను ఆదుకొవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రమేష్, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, విజయ్, నర్సాగౌడ్, లక్ష్మారెడ్డినాయకులు పాల్గోన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు అందరూ ఐక్యంకావాలి

తాడ్వాయి, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణ కోసం పాటుపడాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జూకంటి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బ్రాహ్మణపల్లి, కాలోజివాడి గ్రామాల్లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. రాజ్యాంగం ఆవశ్యకతను వివరిస్తూ రాజ్యాంగ పరిరక్షణకు కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పైడి రాజేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, అధికార ప్రతినిధి షౌకత్, మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ చారి పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

కామారెడ్డిటౌన్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తేనె మంచు పురుగులు లేత చిగురులు, మొగ్గలు, కాయాల నుంచి రసాన్ని పీల్చడంతో పూత, పిందె, ఆకులు వాడి రాలిపోతాయని పేర్కొన్నారు. పురుగులు విసర్జించిన బంక వంటి పదార్థం విస్తరించి చెట్టుభాగాలపై నల్లటి మసి రంగు ఏర్పడుతుందని, అధికనష్టం కలిగించే వీటి నివారణకు 500 లీటర్ల నీటికి ల్యండా సైహలోత్రిన్ లేదా థైయో మిత్తక్సమ్‌మందు 250మి.లీ, హెక్సకోన జోల్ లీటరు, ప్లానోఫిక్స్ 100 మి.లీ మూడు కలిపి పిచికారీ చేయాలని ఈ సందర్భంగా సూచించారు. తామర పురుగుల నివారణకు ఫిప్రోనల్ ఇమాడాక్లోప్రిడ్ మిశ్రమ మందును 250 గ్రాములు 500 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. బూడిద తెగుళ్లను గుర్తిస్తే నివారణకు నీటిలో కరిగే గంధకం 3గ్రాములు లేదా హెక్సకనాజోలు 2మి.లీ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మసితెగులు నివారణకు 500 లీటర్ల నీటికి 10కిలోల స్టార్చ్‌కలిపి పిచికారీ చేయాలని లేదా థైయోమెత్తక్సమ్, హెక్సక నాజోలు 250గ్రాముల మందును 500లీటర్ల నీటితో పిచికారీ చేయాలని తెలిపారు.

గ్రంథాలయానికి రూ.25వేల వాటర్ డిస్పెన్సర్‌ల అందజేత

కామారెడ్డిటౌన్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో చదువుకునే పాఠకులు, నిరుద్యోగుల సౌకర్యార్థం ఉపాధ్యాయుడు తుమ్మ సన్నికుమార్ రూ.25వేల వాటర్ డిస్పెన్సర్‌లను అందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 3వాటర్ డిస్పెన్సర్‌లు తాడ్వాయి, ఎల్లారెడ్డిశాఖ గ్రంథాలయాలకు, కామారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయానికి అందించడం అభినందించదగిన విషయమని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ, ఉపాధ్యాయుడు తుమ్మరమేష్, షేర్లరమేష్, గ్రంథాలయ సిబ్బంది మౌనిక, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అరెస్టులను ఖండిస్తున్నాం: విద్యార్థి సంఘాలు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400ఎకరాల భూమిని అమ్మడానికి రాష్ట్రప్రభుత్వం తీసుకోవడంపై నిరసిస్తున్న విద్యార్థిసంఘాల నాయకులను అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కార్యదర్శి రామకృష్ణ అన్నారు. గురవారం ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ విద్యార్థులు చేస్తున్న ఉద్యమాన్ని అణిచివేసేందుకు అమానుషమైన రీతిలో లాఠీచార్జికి, అరెస్టులకు పాల్పడడం దుర్మార్గమైన చర్యని అన్నారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్‌ను అరెస్ట్‌చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

రాజ్యాంగ ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తాం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం కామారెడ్డి మండలం శాబ్దిపూర్, క్యాసంపల్లిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మతవాదుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. గాంధేయమార్గంలో గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మమోహన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం


గోర్గల్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రజాపతి

నిజాంసాగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్‌రావుపల్లి, గోర్గల్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం సింగిల్ విండో ఆధ్వర్యంలో ప్రారంభించారు. మండలంలోని నరసింగరావుపల్లి, గోర్గల్ గ్రామాల్లో యాసంగిలో సాగు చేసిన వారి ధాన్యం చేతికి రావడంతో వరికోతలు ప్రారంభించారు. ఈ గ్రామాల్లో వరి ధాన్యాన్ని కేంద్రాల్లో నిలువ చేశారు. దీంతో అచ్చంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసింది. ఈకేంద్రాలను విండో అధ్యక్షుడు నరసింహారెడ్డి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జ్యోతిదుర్గారెడ్డి ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో కొనుగోలు చేసే వరి ధాన్యం ఏ గ్రేడ్ 2320, బీ గ్రేడ్ 2,300 చొప్పున క్వింటాకు చెల్లించి కొనుగోలు చేస్తారని రెండో అధ్యక్షుడు తెలిపారు. రైతులు పండించిన వరిధాన్యాన్ని మధ్య దళారులకు అనుకోకుండా విండో ఏర్పాటు చేసిన కేంద్రాల్లోని అమ్ముకోవాలని అధ్యక్షుడు నరసింహారెడ్డి రైతులకు సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మద్నూర్: ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ కోరారు. మద్నూర్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పొద్దు తిరుగుడు గింజల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అన్నివేళలా ఆదుకోవడానికి సిద్ధంగా ఉందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రుణమాఫీ రైతు భరోసా, అందించడంతో పాటు రైతులు పండించిన పంటలను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పొద్దుతిరుగుడు గింజలను రూ.7280 క్వింటాలు చొప్పున కొనుగోలు చేస్తుందని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజు, సింగిల్ విండో కార్యదర్శి బాబురావు, సిబ్బంది విట్టల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సౌజన్య, మండల పార్టీ అధ్యక్షుడు సాయిలు, హనుమాన్ టెంపుల్ చైర్మన్ రామ్ పటేల్, నాయకులు ఉన్నారు.

జైబాపు, జైభీమ్, జైసంవిధాన్‌ను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

మద్నూర్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ మద్నూర్ మండల అధ్యక్షుడు సాయిలు అన్నారు. మద్నూర్ మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు కలిసి, హండే కేలూర్, సలాబత్పూర్, గ్రామాల్లో గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లకు పైగా దేశాన్ని పరిపాలిస్తున్న బీజేపీ రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ అప్రజాస్వామ్య పాలన సాగిస్తుందన్నారు. ప్రజల సమాన హక్కులు, న్యాయం కల్పించాల్సిన పాలకులు, రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను కాలరాయడం అక్షేపనియమని అన్నారు. రాజ్యాంగంపై అవగాహన కల్పించడానికి ప్రజల వద్దకు పాదయాత్రగా వెళ్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రజ్ఞ కుమార్, మాజీ సర్పంచ్ విట్టల్ గురూజీ, ఆలయ కమిటీ చైర్మన్ రామ్ పటేల్, నాయకులు స్వామి, నాగనాథ్, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ ప్రారంభం

సదాశివనగర్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూంపల్లి సబ్‌స్టేషన్ ఉపకేంద్రంలో నూతన బ్రేకర్‌ను ఎస్ఈ శ్రావణ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఒక బ్రేకర్ ఉండడం వల్ల కొన్ని సమస్యలు ఎదురయ్యాయని దానిని నివారించేందుకు కొత్తబ్రేకర్‌ను పాతదానితో కలిసి ఒకటి ఏర్పాటు చేసి సమస్య తొలగించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్‌శాఖ సిబ్బంది గ్రామస్థాయిలో రైతులకు ప్రజలకు ఎలాంటి విద్యుత్ సమస్యలుకల్గకుండా సత్వరమే చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ కళ్యాణ్ చక్రవర్తి, ఏడీ నరేష్, ఏఈ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అకాల నష్టం!

(5వ పేజీ తరువాయి)

కోతదశలో ఉన్న వరిపంటల నేలకొరగగా పలు చోట్ల వరిధాన్యం రాలిపోయి ంది. నష్టం వాటిల్లిన పంటల వివరాలను మండల వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని రైతులు కోరారు.


వర్షానికి రాలిపోయిన ధాన్యం రాశులు

తడిసిన వరి ధాన్యం

నసురుల్లాబాద్: నసురుల్లాబాద్ మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో గురువారం ఉరుములు, మెరుపులతో అకాల వర్షం కురిసింది. ఈ అకాల వర్షానికి రోడ్లపై రైతులు ఆరబెట్టుకున్న వడ్లు తడిసిముద్దయ్యాయి. కష్టపడి పొలాల్లో పండించిన ధాన్యం తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

బీర్కూర్: మండలంలో గురువారం అకాల వర్షం కురిసింది. వర్షం ధాటికి రహదారుల పక్కన, పంటపొలాల్లో ఆరబెట్టిన వరిధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే తమ పరిస్థితి ఏంటని వాపోతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. కోతలుకోసిన అనంతరం రైతులు పచ్చి ధాన్యాన్ని రహదారుల పక్కన, పంటపొలాల్లో ఆరబెట్టుకుంటున్నారు. సరిగ్గా ఇదే సమయంలో వర్షంకురిసింది. ఆరబెట్టుకున్న ధాన్యం తడిసింది. ధాన్యం తవకుండా రైతులు పలు ప్రయత్నాలు చేశారు. పరదాలు తెప్పించి ధాన్యాన్ని కప్పిపెట్టారు. ఇదిలా ఉండగా ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే కోతకు వచ్చిన పంటలు వర్షార్పణం అవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షంతో విరిగిన చెట్లు

జుక్కల్: మండలంలో గురువారం గాలివానతో కురిసిన వర్షం వల్ల నష్టం వాటిల్లింది. కౌలాస్‌లో అకాలవర్షంతో గాలివిపరీతంగా ఉండడంతో వేప చెట్టు విరిగివిద్యుత్ స్తంభాలు తీగలపై పడడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా వరి, మక్క, జొన్న పంటలు గ్రామాల్లో కొంతవరకు నష్టం వాటిల్లినట్టు రైతులు పేర్కొన్నారు. కొందరు రైతులు నూరుపూడి చేసిన ధాన్యం రోడ్డుపై ఆరబెట్టుకోవడంతో కురిసిన అకాలవర్షంతో ధాన్యం తడిసి ముద్దయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు సర్వే చేపట్టి నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్‌చేశారు. పంటలు నష్టంపై వ్యవసాయ అధికారులను ప్రశ్నించగా శుక్రవారం సర్వే చేపట్టి వివరాలు వెల్లడిస్తామని వ్యవసాయ అధికారులు తెలిపారు.


భూముల రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

ధరణి రికార్డులను పరిశీలించిన సబ్ కలెక్టర్

జుక్కల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి ఆకస్మికంగా తనిఖీ చేసి, ధరణి పెండింగ్ భూముల రికార్డులను పరిశీలించారు. జుక్కల్ మండలం కౌలాస్ గ్రామానికి సంబంధించిన భూమి రికార్డులను పరిశీలించి ఇన్‌చార్జి తహసీల్దార్‌కి పలు సూచనలు చేశారు. ధరణి స్లాట్ బుక్ చేసుకున్న రైతులు పెండింగ్‌లో ఉన్న భూమి వివాదాలను సంబంధించిన రికార్డు లను పరిశీలించి ఇన్‌చార్జి తహసీల్దార్‌తో మాట్లాడారు. అదేవిధంగా భూములకు సంబంధించి కోర్టు కేసులు ఉంటే రిజిస్ట్రేషన్ చేయవద్దని సబ్ కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన సబ్‌కలెక్టర్

మద్నూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి గురువారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ధరణి ఇతర సమస్యలపై సమీక్ష నిర్వహించారు. చేశారు. రైతులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బాన్సువాడటౌన్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ల్యాండ్ రెగ్యులరైజేషన్ ఫీజును ఈనెల 30 వరకు 25శాతం మినహాయింపుతో చెల్లించేందుకు అవకాశం కల్పించిందని, దీనిన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు తెలిపారు. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించని వారు వెంటనే చెల్లించి ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

బాన్సువాడటౌన్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో విద్యార్థులపై పోలీసులు చేసిన లాఠీచార్జి అమానుషమని, వారికి మద్దతు తెలపడానికి వెళుతున్న బాన్సువాడ బీజేపీ నాయకులను గురువారం పోలీసులు ముందస్తు అరెస్టుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. ప్రభుత్వం 400 ఎకరాల భూమిని తిరిగి యూనివర్సిటీకి అప్పగించాలని, వేలం వేయాలనే ప్రయత్నాలను విరమించుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, సాయిలు, కోనాల గంగారెడ్డి, గంగారాం, శంకర్ తదితరులున్నారు.



పోలీసు స్టేషన్ వద్ద బీజేపీ నాయకులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- రాబిన్ హుడ్
ప్రియా 70	- స్టేట్ వర్సెస్ నోబడి
ప్రియా 35	- శారీ

బాన్సువాడ

మహేశ్వరి	- మ్యాడ్ స్క్వేర్
వెంకటేశ్వర	- ధీర వీర శూర

చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190